క్లుప్తంగా

శిశుగృహకు బాలుడి తరలింపు

ములకలపల్లి: మానసికస్థితి సరిగాలేని బాలుడిని చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది మంగళవారం హైదరాబాద్‌లోని శిశుగృహకు తరలించారు. ఓ బాలుడు గత రెండు రోజులుగా ములకలపల్లి పరిసరాల్లో సంచరిస్తున్నాడు. హిందీలో మాట్లాడుతున్నప్పటికీ తనకు సంబంధించిన వివరాలేవీ చెప్పడంలేదు. దీంతో స్థానికులు చైల్డ్‌లైన్ 1098కు ఫోన్లో సమాచారం అందించారు. దీంతో ములకలపల్లిలో వచ్చి బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిశుగృహానికి తరలిస్తున్నట్లు చైల్డ్‌లైన్ సిబ్బంది తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం


కావడిగుండ్లలో శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు మధుళిక

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో మంగళవారం గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి మధుళిక రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బచ్చువారిగూడెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేసి చిరు వ్యాధులతో బాధ పడే వారిని గుర్తించి వైద్యం అందించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హెచ్‌వీ దుర్గమ్మ, సిబ్బంది భాస్కర్, ఏఎన్ఎం రమణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారానికి చెందిన కేన్సర్ బాధితుడికి మంగళవారం సాయంత్రం దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఆర్థిక సాయం అందించారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించి గత కొంతకాలంగా ఖాదర్ కేన్సర్ బారిన పడి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వ్యాపారి దోసపాటి నాగేశ్వరరావు బాధితుడికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం పొందాలని అశ్రద్ధ చేయొద్దంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, వసీం, మాదవ్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి

ములకలపల్లి: కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మండలపరిధిలోని మాధారం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణా తరగతుల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో పథకాల అమలుపై పక్కాగా దృష్టి సారించాలని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ త్వరిగతిన అమలు చేసి, కొత్తరుణాలు మంజూరు చేయాలని, రైతుభరోసా కింద ఎకరాలకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. పార్టీ జిల్లాకమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, కొండబోయిన వెంకటేశ్వర్లు క్లాసులు బోధించారు. మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, పాడియం వెంకటేశ్వర్లు, మాళోతు రావూజా, నిమ్మల మధు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి

ములకలపల్లి: రైతుభరోసా తొలివిడత రూ.7,500 రైతు ఖాతాలో జమ చేయాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో వెంటనే రైతుభరోసా పథకాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని ఆమె అన్నారు.

చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలో ఎటువంటి అనుమతులూ లేకుండా యథేచ్ఛగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. మంగళవారం చిన్ననల్లబల్లి గ్రామంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రధాన గ్రామాల్లో యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేస్తున్నప్పటికీ పంచాయతీరాజ్ శాఖ పట్టించుకోవడం లేదన్నారు. లక్ష్మీనగరం,ములకపాడు, చిన్ననల్లబల్లి గ్రామాల్లో జాతీయ రహదారి గుండా 1/70 చట్టానికి విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకున్నా కడుతున్న వాటిని నిలుపుదల చేయాల్సిన అధికారులు నోటీసులు ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాయం రాములు, వీరయ్య, వెంకటేశ్వరరావు, కల్లూరు శ్రీరాములు పాల్గొన్నారు.

చెక్ డ్యాంలకు ప్రాధాన్యత

- భూగర్భ జలాలు పెంపు, ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం
- ఇప్పటికే రూ.4.94 కోట్లు మంజూరు
- టెండర్ల దశలో పనులు


పాములేరువాగుపై ప్రతిపాదిత చెక్‌డ్యాం నిర్మాణ ప్రదేశం..

ములకలపల్లి: భూగర్భ జలాల పెంపుదల, సమీప ఆయకట్టు భూములకు సాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మాణాలను చేపడుతోంది. ఈ క్రమంలో విస్తారంగా వాగులున్న ములకలపల్లి మండలపరిధిలో గత నాలుగేళ్ల క్రితం 6 చెక్‌డ్యాంలు నిర్మించగా, మరో రెంటింటి నిర్మాణానికి ఈ మధ్య కాలంలో నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

18 కిలోమీటర్ల మేర వాగు ప్రవాహం

మండలపరిధిలో అనేక వాగులు ప్రవహిస్తున్నాయి. ముర్రేడు, పాములేరు, సంగెళ్లవాగు, ఊరవాగు, సాకివాగు, పాలవాగు వంటివి మండలవ్యాప్తంగా 18 కిలోమీటర్లమేర వాగు ప్రవాహం ఉంటుంది. ఈ క్రమంలో వీటిపై చెక్‌డ్యాంల నిర్మాణానికి అధికారులు దృష్టి సారించారు. వాగుపై నిర్ణీత ఎత్తులో చెక్‌డ్యాం నిర్మించడం వల్ల వర్షాకాలంలో ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహనం నెమ్మదించి, నిర్మాణ అంచనా మేరకు నీరు ఇక్కడ నిల్వ ఉంటుంది. మిగతా నీరంతా దిగువకు వెళ్లిపోతుంది. అంతే కాకుండా ఇసుక కొట్టుకుపోకుండా, వాగు దిగువకు కోతకు గురికాకుండా కూడా చెక్‌డ్యాంలు దోహదపడుతాయి. చెక్‌డ్యాంల వద్ద నీటి నిల్వ ఉండడంతో సమీప ప్రదేశాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరుగుతాయి. మోటార్ల ద్వారా ఇక్కడి నీటిని ఆయటకట్టు భూములకు అందిస్తారు.

రెండు చెక్‌డ్యాంలకు నిధులు

రాజుపేట శివారులోని పాములేరు వాగుపై చెక్‌డ్యాంకు రూ.3.02 కోట్లు, రాచన్నగూడెం శివారులోని వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.1.92 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే ఒక్కో చెక్‌డ్యాం పరిధిలో 50 ఎకరాల ఆయకట్టు భూములకు సాగు అందుతుంది. రెండు పంటలకు సైతం సమృద్ధిగా సాగు నీరులభిస్తుంది.

సాగునీరు పుష్కలం



చెక్‌డ్యాం పూర్తయితే నీళ్లు పుష్కలంగా ఉంటాయి. సాగు నీటికి ఆందోళన చెందాల్సిన పనిలేదు. భూగర్భ జలాలు పెరగడం వల్ల వ్యవసాయ బోర్లు ఎండిపోయాయనే బాధ ఉండదు.

– నందు, ఆయకట్టు రైతు, రాజుపేట

త్వరగా మొదలుపెట్టాలి



వర్షాకాలం నేపథ్యంలో వానలు పడితే పనులు నిలిచిపోయే ప్రమాదముంది. నిర్మాణం వెంటనే మొదలుపెట్టాలి. వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలి.

– వీరూనాయక్, రాజుపేట

టెండర్ దశలో ఉన్నాయి..



రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.4.94 కోట్ల నిధులు వచ్చాయి. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇంకా ఖరారు కాలేదు. టెండర్ కాగానే పనులు ప్రారంభిస్తాం.

– గఫూర్‌పాషా, ఏఈ, ఇరిగేషన్

సాగుపై రైతులకు అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

ములకలపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం రైతులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌లో.. రైతులు సేంద్రియ సేద్యంపై దృష్టి సారించాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి, డాక్టర్ ప్రశాంత్ సూచించారు.

సేంద్రియ వరిపంట సాగులో తీసుకోవలని జాగ్రత్తలు, అధికసాంద్రత పత్తిసాగులో యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు వివరించారు. అశ్వారావుపేట వ్యవసాయ సంచాలకులు అఫ్జల్‌బేగం, మండల వ్యవసాయాధికారిణి కరుణామయి, ఎంఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఇఫ్టూ అనుబంధ గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాసర్‌పాషా కోరారు. ఈ మేరకు మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాసర్‌పాషా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మణుగూరు మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన బుగ్గ, ఖమ్మం తోగు, బుడుగుల, రేగులగండి, రాయన్నపేట, సర్వాయిగుంపు, పెద్దిపల్లిలతో పాటు అశ్వాపురం, పినపాక, కరకగూడెంలోని గిరిజన గ్రామాల్లో రహదారి, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాల నేపథ్యంలో వారి అవస్థలు మరింత దయనీయంగా మారే అవకాశం ఉందన్నారు. పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు సైతం లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని, దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్, ఆదివాసీలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం మండల అధ్యక్షురాలు ఈశ్వరమ్మ

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు సున్నం ఈశ్వరమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికుల మండల స్థాయి సమావేశాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన మహిళా కార్మికుల మండల స్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ఎంపికైన సున్నం ఈశ్వరమ్మ సమావేశంలో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలను నెలకు పదివేల రూపాయలకు పెంచి, వంట చేయడానికి గ్యాస్, కట్టెపుల్లలతో పాటుగా కోడిగుడ్లకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్, మంగ, ఈశ్వరమ్మ, జ్యోతి, జయమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులతోనే భరోసా


భద్రాచలంఅర్బన్: బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు భరోసా, భవిష్యత్ ఉంటుందని అశ్వారావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత అన్నారు. మంగళవారం అశ్వారావుపేటతోపాటు మండలంలోని వినాయకపురం, నారాయణపురం, అచ్యుతాపురం, మామిళ్లవారిగూడెం, గుమ్మడవల్లి, ఊట్లపల్లితోపాటు పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి.. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే సౌకర్యాలు, ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అలాగే వారికి కరపత్రాలను పంపిణీ చేసి, బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు.

భద్రాచలంఅర్బన్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, వారికి చదువు, ఆటపాటలు, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తారని భద్రాచలం ఐసీడీఎస్ సూపర్ వైజర్ సావిత్రి అన్నారు. భద్రాచలం పట్టణంలో ఉన్న వివిధ కాలనీల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల నమోదుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పిల్లల తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

13న సంత వేలం పాట

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 13వ తేదీన అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన సంత వేలం పాట జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు ప్రత్యేకాధికారి, డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ అధ్వర్యంలో వేలం ఉంటుందని తెలిపారు. అసక్తి ఉన్న వారు సంత వేలం పాటకు హాజరు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన జీసీసీ సేల్స్‌మెన్ కోండ్రు శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శ్రీనివాసరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. రేషన్‌డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు, డీలర్లు బండ్ల వెంకటేశ్వర్లు, పాయం భద్రయ్య, కోండ్రు వంశి తదితరులు శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సీపీఐ నాయకుడి మృతికి నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ మండల సీనియర్ నాయకుడు భోక్సిం వీరయ్య అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం వారి నివాసంలో వీరయ్య మృతదేహానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి పూలమాలలు వేసి అరుణపతాకం కప్పి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 16వ తేదీన జరిగే ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష ఎన్నికలో ఓటు హక్కు ఉన్న వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆ సంఘం జిల్లా నాయకులు దారా రమేష్ కోరారు. మంగళవారం ఆయన అశ్వారావుపేటలో తన అనుచరులతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి సేవ చేసేందుకు తాను పోటీలో ఉన్నానని, ఓటు వేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో దారా నగేష్, గణేష్, నగేష్ శంకర్, ఆదిత్య, కృపాకర్, డీఎస్ఎస్‌వీ ఎంకే బాబు, కిషోర్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో చోటు హర్షణీయం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌కు హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించడం ద్వారా దేశ అంతర్గత భద్రతకు విఘాతం కలిగించే శక్తులకు గుణపాఠం అవుతుందన్నారు. అలాగే కిషన్‌రెడ్డికి తెలంగాణ బొగ్గు గనుల శాఖను ఇవ్వడం ప్రధాని మోడీకి రాష్ట్ర అభివృద్ధిపై ఉన్న శ్రద్ధ తేటతెల్లమవుతోందన్నారు.ప్రధాని నరేంద్రమోడీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి అక్రమ రవాణా


సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టిని తవ్వుతున్న జేసీబీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి మంగళవారం యథేచ్ఛగా అక్రమ రవాణా సాగించారు. రెండు జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో మట్టిని అక్రమంగా తరలించారు. మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలకు చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు రెండు గ్రామాల్లో మట్టిని ఒక్కో ట్రాక్టర్ రూ.500కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంత కాలంగా మొండికుంట, కృష్ణసాగర్ అటవీ ప్రాంతాల్లో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా ఇరిగేషన్, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి అక్రమ రవాణా విషయం అధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టాయిలెట్ బ్లాక్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రోటరీ క్లబ్, మొయినాబాద్ రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా భద్రాచలంలోని ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్‌లో రూ.8లక్షలతో టాయిలెట్ బ్లాక్‌ను నిర్మాణం చేయనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ వాసుదేవ్ పాల్గొని మాట్లాడారు. భద్రాచలం రోటరీ క్లబ్ ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంచి పనులను చేస్తూ అందరి మన్ననలు పొందుతోందని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయురాలు రమ, ప్రోగ్రాం చైర్మన్ మునికేశవ్, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి విద్యాసాగర్, పాస్ట్ ప్రెసిడెంట్స్ యశోద రాంబాబు, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, జకరయ్య, నాగేశ్వరరావు, వసంతరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ బాలాజీ, క్లబ్ సభ్యులు అజీమ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

15న ఆయిల్‌పాం రైతుల సదస్సు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగుదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ కోరారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన అశ్వారావుపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సుకు ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావులు హాజరు అవుతారని తెలిపారు. ఈ సదస్సులో ఆయిల్‌పాం సాగు, యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యాన శాస్త్రవేత్తలు, శాఖ నిపుణులతో రైతులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, కొండబోయిన వెంకటేశ్వరరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, తగరం జగన్నాథం, భద్రం పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రైడే..


నీటి నిల్వలను పరిశీలిస్తున్న ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: నీటి నిల్వలను లేకుండా చూసి, తద్వారా దోమల వ్యాప్తిని నివారించాలని ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక పరిశీలన చేసి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు నీటి నిల్వల ద్వారా వ్యాప్తి చెందే దోమల కాటు వల్ల మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని తెలిపారు. ఇంటి పరిసరాలు, వీధుల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. జ్వర సంబంధిత లక్షణాలు ఉంటే, నిర్లక్ష్యం వహించకుండా వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి, సంబంధిత రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంపుపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు

మణుగూరుటౌన్: సింగరేణి వారసత్వ ఉద్యోగుల వయో పరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంపుపై సర్క్యులర్ విడుదల చేయడం పట్ల ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పీవీకాలనీలోని కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. నిరాశ నిస్పృహలతో ఉన్న డిపెండెంట్‌లకు 40 ఏళ్లకు వయోపరిమితి పెంపు సర్క్యులర్‌తో వారసత్వ ఉద్యోగుల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. సమావేశంలో సూరపాక రాములు, షేక్ మస్తాన్, మిద్దెపాక శ్రీనివాస్, జయరాజు ఉన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. మండలంలోని గోపన్నగూడేనికి చెందిన కబడి గంగరాజు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గత నెల 27వ తేదీన కాలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో బాధిత కుటుంబానికి రూ.5వేల విలువైన బియ్యం 25 కేజీలు, వంట సామగ్రి, దుస్తువులు, నిత్యావసర సరుకులతోపాటు కూరగాయాలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కణితి ప్రసాద్, కల్లం సురేష్, కల్లం పండు, కబడి శ్రీరామయ్య, సిరివంతరావు, కుంజా వెంకటేశ్వరరావు, సంకురావు, మడకం మంగరాజు, గోసయ్య, జల్లి కాంతరావు, భూక్య ప్రసాద్, కోడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల కోసం ఆందోళన



ఆర్టీసీ బస్టాండ్‌లో ఆందోళన చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీలోని దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లి, మారాయిగూడెం, ఆర్లగూడెం గ్రామాలకు రహదారులు ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే భద్రాచలం బస్టాండ్ నుంచి రాత్రి తొమ్మిది దాటితే కొత్తగూడెం వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సులను నిలిపివేయడంతో ఆయా గ్రామాల అధిక చార్జీలు చెల్లించి ఆటోలలో ప్రయాణం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రహదారులు బాగున గ్రామాలకు బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కంగాల భూలక్ష్మి, సుజాత, షకీరా, తస్నీరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.